క్లుప్తంగా

26న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

పీలేరు రూరల్ : ఈ నెల 26న పీలేరు నుంచి అరుణాచలానికి (తిరువణ్ణామలై) ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనున్నట్లు డీఎం బండ్ల కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం గిరి ప్రదక్షిణకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. వివరాలకు మార్కెటింగ్ టీమ్ కె.వి. రమణ 7893152748 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

11 మంది జూదరుల అరెస్టు

ములకలచెరువు: స్థానిక టమాట మార్కెట్‌లో గుట్టుగా పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు సీఐ తమ్మిశెట్టి మధు శుక్రవారం పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు తాను సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించగా 11 మంది జూదరులు పట్టుబడ్డారన్నారు. వారిపై కేసు నమోదు చేసి వారి వద్ద లభించిన రూ.23,500ల నగదును స్వాధీం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో శుక్రవారం ఈవీఎంల పనితీరుపై సెక్టోరల్ అధికారి నారాయణ, తహసీల్దార్ విద్యాసాగర్‌లు ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు ఎలా వేయాలి, వేసిన ఓటుని ఎలా నిర్ధారించుకోవాలనే ప్రక్రియను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదవ్వాలన్నారు. ఎంఈఓ-2 గొస్పీర్, స్థానిక వీఆర్‌ఓ లలితమ్మ పాల్గొన్నారు.

20న కురబలకోటలో 'జగనన్నకు చెబుదాం'

కురబలకోట: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కురబలకోట మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు, ఎంపీడీఓ దిలీప్‌కుమార్ గురువారం తెలిపారు. సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. వచ్చిన అర్జీలపై ఆయా శాఖల అధికారుల ద్వారా సత్వరం సమీక్షించి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. అర్జీదారులకు తగిన సమాచారం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి తీరని లోటు

మదనపల్లె సిటీ: ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి తీరని లోటని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆయన మృతికి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీగా షేక్ సాబ్జీ ఉపాధ్యాయ సమస్యలపై ఎనలేని పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమణ, డివిజన్ కన్వీనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యుటీఎఫ్ నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

మదనపల్లె: మదనపల్లె ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి శుక్రవారం ఆర్థికసాయం అందించినట్లు ప్రెసిడెంట్ ప్రసాద్ తెలిపారు. వాల్మీకిపురానికి చెందిన ఫొటోగ్రాఫర్ ప్రేమ్‌కుమార్ అనారోగ్యంతో నాలుగురోజుల క్రితం మరణించారు. మదనపల్లె ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు తమవంతుగా రూ.54,500 ఆర్థికసహాయాన్ని అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో అక్రమాలను బయటపెట్టండి

కలకడ: మండలంలోని అన్ని గ్రామాలలో జరిగిన గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని ఎలాంటి అక్రమాలు జరిగినా కూలీలు, గ్రామస్తులు సచివాలయంలో జరిగే బహిరంగ సమావేశంలో కానీ, మండల స్థాయిలో జరిగే బహిరంగ సామాజిక తనిఖీ నివేదికలో బయటపెట్టవచ్చని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. 16వ తేదీ నడిమిచెర్ల, 17న దేవులపల్లె, 19న కె.దొడ్డిపల్లె, కె.బాటవారిపల్లె, 21న నవాబుపేట, 22న గంగాపురం, రాతిగుంటపల్లె, ముడియంవారిపల్లె, కలకడ, పంచాయతీలలో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అన్ని వర్గాలకు మేలు చేశాం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



సొసైటీకాలనీ పార్కులో జిమ్ పరికరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు, రైతులు, విద్యార్థులకు వివిధ పథకాల ద్వారా మేలు జరిగిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 11వ వార్డు బసినికొండ, 26వ వార్డు సొసైటీకాలనీ-2 వార్డు సచివాలయాల పరిధిలో డీఎస్పీ బంగ్లా సమీపంలో, డాక్టర్.వైఎస్సార్ సొసైటీకాలనీ పార్కు వద్ద ఆయన శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందిన లబ్ధిని వివరిస్తూ ఏర్పాటుచేసిన డిజిటల్‌బోర్డును ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే బ్రోచర్స్‌ను ఆవిష్కరించారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు వస్తున్నందున... చంద్రబాబు మరోసారి ప్రజలను మోసగించేందుకు అబద్ధపు హామీలతో మీ ముందుకు వస్తున్నాడని, మాయమాటలు నమ్మవద్దని ప్రజలను హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకాచలపతి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సదాశివరెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, సీపీ.వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్.అనిల్‌కుమార్, పవన్, తట్టిశ్రీనివాసులురెడ్డి, బాలగంగాధరరెడ్డి, రాఘవరెడ్డి, కౌన్సిలర్లు పాల్‌చంద్రశేఖర్, ఆర్.వి.శివారెడ్డి, రామిశెట్టిశివయ్య, మేస్త్రీశ్రీనివాసులు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ వస్తున్నాం..

ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు నియోజకవర్గంలో గడప గడపకూ వస్తున్నామని, ఇది గతంలో ఏ ప్రభుత్వంలోనైనా జరిగిందా అని ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రజలను ప్రశ్నించారు. శుక్రవారం మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ వెంకప్పకోట సచివాలయ పరిధిలోని బాలాజీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. గ్రామంలో మౌలికసదుపాయాలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సేవలపై ఆరాతీశారు.అనంతరం బాలాజీనగర్ కాలనీవాసుల నీటి సమస్య తీర్చేందుకు రూ.21లక్షలతో తాగునీటి ఓవర్‌హెడ్‌ట్యాంక్ నిర్మాణం, 8 లక్షలతో పైప్‌లైన్ పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, సిద్దలవేమారెడ్డి, ఇస్మాయిల్, నీరుగట్టిరమణ, జేసీకే కన్వీనర్ పోతబోలునాగరాజ, వార్డు మెంబర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సొసైటీ కాలనీకి సరికొత్త అందం

పట్టణంలోని సొసైటీకాలనీ వాసులకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచేందుకు సరికొత్త అందాలతో డాక్టర్.వైఎస్సార్ సొసైటీకాలనీ మున్సిపల్ పార్కు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అమృత్ పథకం కింద మంజూరైన రూ.30లక్షల నిధులతో పార్కును ఏర్పాటుచేశారు. శుక్రవారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, స్థానిక నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పార్కును ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీలోని 35 వార్డుల్లో ప్రజావసరాలకు అనుగుణంగా కోట్లాదిరూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. వ్యాయామం చేసుకునేందుకు ఓపెన్‌జిమ్, పిల్లలు ఆడుకునేందుకు ఆటపరికరాలు, పచ్చికతో కూడిన గార్డెన్ ఏర్పాటుచేశామని, కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండెజబ్బులపై అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె: గుండెజబ్బులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో స్థానిక టమాటా మార్కెట్‌యార్డులో నారాయణ హృదయాలయ వైద్యులతో కలిసి 18వ గుండె వైద్య శిబిరం నిర్వహించారు. బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం .శివప్రసాద్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులుతో కలిసి గుండె వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ శిబిరంలో 158 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. అందులో 6 మందికి గుండె జబ్బులున్నట్లు నిర్ధారణ చేసి, కోలార్‌లోని నారాయణ హార్ట్‌సెంటర్‌కు రెఫర్ చేశారు. అక్కడ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నారాయణ హృదయాలయ గుండెవైద్యులు డాక్టర్.మంజునాథ్‌బాబు, క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్.కిరణ్‌కుమార్, టెక్నీషియన్లు, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకు మహా పాదయాత్ర



మహాపాదయాత్రకు బయలుదేరుతున్న అయ్యప్పమాలధారులు

మదనపల్లె సిటీ: మదనపల్లె నుంచి మహాపాదయాత్రగా వెంకటరమణ (కరెంటు)స్వామి, ఆనంద్‌స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పమాలాధారులు శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. స్థానిక చేనేతనగర్‌లోని అభయంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం 70 మంది ఇరుముడులు కట్టుకుని పాదయాత్రగా బయలుదేరారు. 30వ సారి బయలుదేరిన మహాపాదయాత్ర శబరిమలైకి డిసెంబర్ 31న చేరుకుంటామని వారు తెలిపారు.

క్రీడల్లో రాణించిన గురుకుల పాఠశాల విద్యార్థిని

కలకడ : మండలంలోని ఏపీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాలలోని విద్యార్థిని జిల్లా స్థాయిల్లో క్రీడల్లో రాణించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సుమిత్ర శుక్రవారం తెలిపారు. పల్నాడు డీఎస్‌ఎ స్టేడియంలో ఈ నెల 12, 13, 14వతేదీలలో జరిగిన 67వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఉమ్మడి చిత్తూరు తరపున కలకడ ఏపీ రెసిడెన్సియల్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని హరిత 400 మీటర్ల హార్డిల్స్‌లో తృతీయస్థానం సాధించినట్లు తెలిపారు.

జిల్లా అనుబంధ విభాగ కమిటీలలో నియామకం

మదనపల్లె: **నియోజకవర్గానికి చెందిన పలువురిని జిల్లా అనుబంధ విభాగ కమిటీలలో వివిధ విభాగాల్లో నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు ఇచ్చింది. అందులో డిస్ట్రిక్ట్ బీసీ సెల్ కమిటీ జనరల్ సెక్రటరీగా డి.నరసింహులు, సెక్రటరీలుగా బి.ఆర్.భానుప్రకాష్, కదిరీవతి, జాయింట్ సెక్రటరీలుగా వై.గణేష్, టి.బాలాజీ నియమితులయ్యారు. డిస్ట్రిక్ట్ కల్చరల్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా చేలూరుసూర్యనారాయణ, జనరల్ సెక్రటరీగా కోటూరురత్నం, సెక్రటరీలుగా డి.ఆదినారాయణ, ఓ.రెడ్డెప్పరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కే.రామకృష్ణ, బి.శివయ్యలను నియమించారు. డిస్ట్రిక్ట్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా బి.జాన్‌బాబు, జనరల్ సెక్రటరీగా ఎస్.డబ్ల్యూ.బెర్నార్డ్‌రాజేష్, సెక్రటరీలుగా రిచర్డ్ క్రిస్టఫర్ ఆలెగ్జాండర్, వి.జయకుమార్, జాయింట్ సెక్రటరీలుగా జీఎంఎస్.రమేష్‌బాబు, రెడ్డిశేఖర్‌లు నియమితులయ్యారు. డిస్ట్రిక్ట్ స్టూడెంట్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్.అశోక్‌కుమార్, జనరల్ సెక్రటరీగా ఏ.గణేష్, సెక్రటరీలుగా కే.ప్రశాంత్, ఏ. అన్వేష్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా అభివర్ధన్‌రెడ్డి, పి.గణేష్, పి.ఆర్.కిషోర్, ఏ.రాజశేఖర్‌రెడ్డి, పఠాన్‌షారుఖ్‌ఖాన్‌లను నియమించారు.**

వాణిజ్య విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధిగా చంద్రమౌళి

మదనపల్లె సిటీ: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మదనపల్లెకు చెందిన గార్ల చంద్రమౌళిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో రాజంపేట వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు.

తంబళ్లపల్లెకు పెద్దపీట

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ కమిటీల్లో తంబళ్లపల్లె నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇచ్చారు. శుక్రవారం పార్టీ కేంద్ర కమిటీ ప్రకటించిన ఐదు విభాగాల్లో 22 మందికి చోటు దక్కింది. బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా చాపా సుబ్రమణ్యం, కార్యదర్శులుగా తళ్లా చంద్రశేఖర్, మూర్తినాయుని చక్రపాణినాయుడు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.రెడ్డెప్ప, బెంజం రామమోహన్ నియమితులయ్యారు. జిల్లా సంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా నారపరెడ్డి సుధాకరెడ్డి, ప్రధానకార్యదర్శిగా వలిపి రాధ, కార్యదర్శులుగా కాలువపల్లె శివయ్య, అంకిరెడ్డి చౌరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సదుం రమణప్ప, ఎస్.శివశంకర్‌రెడ్డి నియమితులయ్యారు. జిల్లా క్రిష్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎస్.భరత్‌కుమార్ (బాబీ), ప్రధానకార్యదర్శిగా బి.జాన్‌శీనా, కార్యదర్శులుగా కె.ఇజ్రాయేలు (రమణప్ప), బి.రాజన్న, సంయుక్త కార్యదర్శులుగా టి.పాల్, ఎం.శామ్యూల్ నియమితులయ్యారు. జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎం.అభిషేక్‌రెడ్డి, కార్యదర్శులుగా జి.సాయిచరణ్, హేమంత్, సి.చలపతి, సంయుక్త కార్యదర్శిగా జి.కిషోర్‌లను నియమించారు.

వైఎస్సార్‌సీపీలో నూతన నియామకం

పీలేరు : వైఎస్సార్‌సీపీలో జిల్లా అనుబంధ కమిటీల్లో పీలే రు నియోజకవర్గానికి సంబంధించి పలువురికి పదవులు లభించాయి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వుల మేరకు జిల్లా బీసీసెల్ కమిటీలో జనరల్ సెక్రటరీగా బొగ్గల ఆనంద, సెక్రటరీలుగా మల్లికార్జున, డి. సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా తెల్లజీర వెంకటసిద్దులు, వై. సుబ్బయ్య నియమితులయ్యారు. అలాగే జిల్లా కల్చరల్ వింగ్ కమిటీలో జనరల్ సెక్రటరీగా ఎ. అమరనాథరెడ్డి, సెక్రటరీలుగా ఎం. రమణ, బి. వెంకటరమణ, జాయింట్ సెక్రటరీలుగా పసుపులేటి చిన్నబాబు, పాల ఏకరి ధరణీష్, జిల్లా క్రిష్టియన్ మైనారిటీ విభాగంలో జనరల్ సెక్రటరీగా బి. శ్రీనివాసులు, సెక్రటరీలుగా సి. విజయశేఖర్, వి. విజయకుమార్, జాయింట్ సెక్రటరీలుగా జె.ఎలీషా, పి.ఎర్రయ్య నియమితులయ్యారు. జిల్లా స్టూడెంట్ వింగ్‌లో జనరల్ సెక్రటరీగా ఎస్. మస్తాన్, సెక్రటరీలుగా ఎస్. జాఫర్, ఎం. శివమణినాయక్ నియమితులయ్యారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు, వల్లభాయ్ పటేల్ వర్ధంతి



పొట్టి శ్రీరాములు,వల్లభాయ్‌పటేల్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వాల్మీకిపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని శుక్రవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని గండబోయనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డి మోహన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరు: ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం ఆత్మత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు వర్ధంతిని శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వారపుసంతక వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజులు సంపూర్ణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కలకడ: ఆంధ్రరాష్ట్ర అవతరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం, స్వాతంత్ర్య ఉద్యమంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ పోరాటపటిమ మరువలేనిదని ఎంపీపీ శ్రీదేవి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారి చిత్రపటాలకు నివాళ్ళుఅర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, ఏపిఎం చెన్నకేశవులు, ఏఈ శ్రీరాములు, నాగమల్లయ్య పాల్గొన్నారు.

గడప వద్దకే ప్రభుత్వ సేవలు



ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



చెరువు కొండపై పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించి రూ.కోటి నిధులతో పెద్దపాళ్యం, ములకలచెరువులో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే, గ్రామ సచివాలయాలతోపాటు సెంట్రల్ స్కూల్ వద్ద ఓ పాల డైరీని లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో గడప వద్దకే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, కన్వీనర్ మాధవరెడ్డి, సర్పంచ్ వెంకట్రమణారెడ్డి, రహమత్‌బీ, నాయకులు రవిశేఖర్‌రెడ్డి, చాంద్‌బాషా, రవీంద్రారెడ్డి, విశ్వనాథ్, సదాశివ, అధికారులు పాల్గొన్నారు.

అవధూత జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు వ్యాసరాయ చెరువు కొండపై వెలసిన శ్రీ అవధూత ఆదినారాయణ స్వామి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, డ్రిప్ రమణ, గణపతిరెడ్డి, సుబ్బరాం, రహంతుల్లా, పాల శీనా, పట్టెరిక శంకర్, చెరువు నరసమ్మ, కేశవ్, గౌర్ల శీనా, సుబ్బిరెడ్డి, నాగార్జునరెడ్డి, బసిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీపతి, హిద్దీ, గట్టు శీనా, వెంకట్, ప్రదీప్, వెంకట్‌రెడ్డి, మెకానిక్ చంద్ర, శంకర్, రియాసత్ అలీఖాన్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ వాహనాల వేలం

మదనపల్లె: ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో సీజ్‌చేసిన పలు వాహనాలను శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అన్నమయ్యజిల్లా, రాయచోటి ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ ఆదేశాల మేరకు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు రుసుం చెల్లించి, వేలంలో పాల్గొనాల్సిందిగా కోరారు. వివరాలకు 9440902595 సంప్రదించాలన్నారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు



గుర్రంకొండలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిపించిన ఎంపీడీఓ ఐసీడీఎస్ సూపర్‌వైజర్



కురబలకోట: అంగన్‌వాడీ స్కూల్‌ను తెరిపించిన సచివాలయ సిబ్బంది



మదనపల్లె : బసినికొండ అంగన్‌వాడీ కేంద్రంను తెరిపిస్తున్న సీడీపీఓ సుజాత

యథావిధిగా కొనసాగిన కార్యకలాపాలు

గుర్రంకొండ: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకొన్నాయి. అధికారులు ఉదయాన్నే అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించడంతో యథావిధిగా కార్యకలాపాలు కొనసాగాయి. గత కొన్నిరోజులుగా అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో చిన్నపిల్లలకు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందక ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలు మేరకు శుక్రవారం ఎంపీడీఓ వెంకటేశులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహలక్ష్మీ, రాణీలు అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు చేరుకొని ఆయ గ్రామానికి చెందిన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో తెరిపించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా గ్రామాలకు చెందిన వివిధ శాఖలకు చెందిన సచివాలయ ఉద్యోగులకు ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన పిల్లలకు పక్కనున్న ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనాన్ని వడ్డించారు.

కురబలకోట: అంగన్‌వాడీల సమ్మెతో మండలంలో మూతపడిన అంగన్‌వాడీ స్కూళ్లను శుక్రవారం ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది తెరిపించి అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించారు. రికార్డులను, స్టాక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని 50 అంగన్‌వాడీ స్కూళ్లు తెరచుకున్నట్లు సూపర్‌వైజర్ శ్వేత తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బందికి నిర్వహణ బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు.

తంబళ్లపల్లె : మండలంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, హెల్పర్లు సమస్యల పరిష్కారం కోసం నాలుగు రోజులుగా కేంద్రాలు మూసి సమ్మెకు దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీడీఓ సురేంద్రనాథ్, సీడీపీఓ నాగవేణి, సూపర్‌వైజర్లు గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను పునఃప్రారంభించారు.

అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యతలు అప్పగింత

మదనపల్లె : అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెకు దిగిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ, సచివాలయ వ్యవస్థ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు సీడీపీఓ సుజాత తెలిపారు. సోమవారం మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 249 అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను ఇచ్చేందుకు కార్యకర్తలు నిరాకరించడంతో సచివాలయ అడ్మిన్ సమక్షంలో తాళాలు తెరిపించి సచివాలయ ఎంఎస్‌కే, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు. మొత్తం 213 మంది సచివాలయ సిబ్బందికి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను అప్పగించి, కేంద్రంలోని ఫిజికల్ స్టాక్‌ను వెరిఫై చేసుకోవాల్సిందిగా ఆదేశించామన్నారు. పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకుల ద్వారా ప్రీస్కూల్ పిల్లలకు ఆహారాన్ని వడ్డించేందుకు ఏర్పాట్లు తీసుకుంటున్నామన్నారు. పాఠశాల ఆవరణలో లేని కేంద్రాల్లో స్థానిక మహిళాసంఘాల సభ్యుల సహాయంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యథావిధిగా అంగన్‌వాడీ కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సచివాలయ సిబ్బందికి అదనపు బాధ్యతలు

వాల్మీకిపురం: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వాల్మీకిపురం, కలికిరి, కలకడ, గుర్రంకొండ మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు గత నాలుగు రోజులు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు.

దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను సచివాలయ సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు సీడీపీఓ భారతి తెలిపారు. శుక్రవారం వెటర్నరీ అసిస్టెంట్ శివశంకర్, పంచాయతీ సెక్రటరీ క్రాంతి, వీఆర్‌వో సుధాకర్‌లు అంగన్‌వాడీ సిబ్బందిని తాళాలు ఇవ్వాలని అడుగగా ఇవ్వకపోవడంతో తాళాలను తెరిపించి కేంద్రంలో ఉన్న స్టాక్‌ను పరిశీలించినట్లు సీడీపీఓ తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 133 కేంద్రాలను తెరిచి స్టాక్‌ను పరిశీలించినట్లు తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

తంబళ్లపల్లె: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నాలుగు రోజులుగా సమ్మెకు దిగాం.. గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా కేంద్రాలను తెరవడం సమంజసం కాదని ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కోరారు. శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లోని 173 కేంద్రాల కార్యకర్తలు, హెల్పర్లు తంబళ్లపల్లె ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నాలుగు రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. శుక్రవారం ఒక్కసారిగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను గ్రామ సచివాలయ ఉద్యోగులచే తెరిపించడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

వాల్మీకిపురం: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన దీక్ష నాల్గవ రోజుకు చేరుకుంది. శుక్రవారం పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి గాంధీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు చంద్రావతి మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్డు బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇంటి వద్దకే వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ



పశువులకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

వాల్మీకిపురం: గ్రామాల్లో పశువులు వ్యాధి బారిన పడినప్పుడు చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్ళకుండా ఇంటి వద్దకే వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు పశువైద్యాధికారి హర్షియా తెలిపారు. శుక్రవారం మండలంలోని విఠలం, పునుగుపల్లి, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో వ్యాధి బారిన పడిన పశువులకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలకు కలసి వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనం ఉందని, పశువులకు తీవ్ర వ్యాధులు సోకినప్పుడు 1962 నెంబరుకు ఫోన్ చేస్తే వెంటనే వచ్చి చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజెన్స్ సమస్యలు పరిష్కారించాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యడులు ఎన్.మునిగోపాలకృష్ణ ఆలిండియా సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షుడు బదానికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ముంబైలో జరిగిన ఆలిండియా సీనియర్ సిటిజెన్స్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు హాజరయ్యారు. ఏపీలో సీనియర్ సిటిజెన్స్ సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకున్నట్లు తెలిపారు.